ప్రజాశక్తి
శుక్రవారం 17 ఏప్రిల్ 2024
5
పార్వతీపురం మన్యం

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్**

మండలంలోని నర్సిపురం సబ్ స్టేషన్ మరియు తాళ్ళబురిడీ సబ్ స్టేషన్ మరమ్మత్తులు కారణంగా శుక్రవారం నాడు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడనుందని ఎడిఎ సి రమణ తెలిపారు. మండలంలోని నర్సిపురం, హెచ్.కారాడవలస, వెంకంపేట, పెద్ద బొండపల్లి, పుట్టూరు, రావికోన, సంఘం వలస, చిన్న బొండపల్లి, పెదమరికి, చిన్నమరికి, డీకే పట్నం, తాళ్ల బురిడీ, గోచక్క, డోకిశీల, లచ్చిరాజుపేట, బందలుప్పి, పెద్ద బొండపల్లి, జమదాల, లక్ష్మీ నారాయణ పురం, వైకేయం కాలనీ గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందనీ అందువల్ల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# వైసిపిలో కలవరం

- సొంతపార్టీ కార్యకర్తల పట్ల నిర్లక్ష్యం
- భూహక్కు చట్టంపై టిడిపి విస్తృత ప్రచారం
- అయినా ఓటింగ్ శాతం పెరుగుదలతో గెలుపు తమదే అంటున్న అభ్యర్థులు

**ప్రజాశక్తి - సాలూరు**

పార్వతీపురం మన్యం జిల్లాలో వైసిపి శ్రేణులను ప్రభుత్వ వ్యతిరేక పవనాలు కలవరపెడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకే చేరవేశామని, నగదు బదిలీ ద్వారా పేదల ఖాతాల్లో లక్షలాది రూపాయలు జమ చేశామనే ధీమా అధికారపార్టీ నాయకుల్లో బలంగా ఉంది. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇవ్వని విధంగా అత్యధిక మొత్తంలో పింఛను, అధిక సంఖ్యలో ఫించన్లను వాలంటీర్ల తో లబ్దిదారుల ఇళ్లకే అందిస్తున్న ప్రభుత్వం తమదేనని ఆ పార్టీ నాయకులు గర్వంగా చెప్పుకున్నారు. నవరత్నాలనే సంక్షేమ పథకాలకు అర్హులైన పేదలకు లక్ష నుంచి పది లక్షల వరకు లబ్ది చేకూరిందని, వారి ఓట్లు వైసిపికే పడతాయనే ఆత్మవిశ్వాసం పైకి కనిపించినా లోలోపల ఏదో ఒక రూపంలో భయం వెంటాడుతున్నట్లు తెలుస్తోంది. 2019 ఎన్నికల్లో ఒక్క ఛాన్స్ ఇవ్వాలని కోరుతూ ప్రజాసంకల్ప యాత్రతో అనూహ్య రీతిలో వైసిపి ప్రజాదరణ పొందింది. ఆదరణకు తగినట్లుగానే ఆ ఎన్నికల్లో ఓటర్లు వైసిపికి అనూహ్యరీతిలో అనుకూల తీర్పు ఇచ్చారు.

2014 నుంచి 2019వరకు టిడిపి ప్రభుత్వం హయాంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమవడాన్ని వైసిపి విస్తతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళింది. 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత నవరత్నాలనే సంక్షేమ పథకాలు అమలు మాత్రమే తమ ముందున్న ప్రథమ కర్తవ్యమన్న రీతిలో ప్రభుత్వం వ్యవహరించింది.దీని వల్ల రోడ్లు, భవనాలు, వంతెనల నిర్మాణం వంటి అభివృద్ధి పనుల పట్ల కొంత నిర్లక్ష్యం వహించింది. మద్య నిషేదం అమలు చేయడం లో విఫలమవడం, విచ్చలవిడిగా బెల్ట్ షాపులకు తెరలేపడం, సామాన్య ప్రజలు వినియోగించే మద్యం ధరలు భారీగా పెంచడం వంటి అంశాలు అధికారపార్టీకి ప్రతికూల ప్రభావం చూపించే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన భూహక్కు చట్టంపై టిడిపి నాయకులు చేసిన ప్రచారం కూడా అధికారపార్టీకి కొంత తలనొప్పిగా మారింది. సంక్షేమ పథకాల అమలుతో అది కొట్టుకుపోతుందనే భావం ఆ పార్టీ నాయకులలో కనిపించింది. నవరత్నాలనే పథకాల ద్వారా నగదు బదిలీ చేయడం ఒక్కటే తమను మళ్ళీ అధికారంలోకి తెస్తుందని వైసిపి నాయకులు భావిస్తున్నారు. పెరిగిన ఓటింగ్ శాతాన్ని బట్టి వైసిపి పట్ల ఆదరణకు సంకేతమని అధికారపార్టీ నాయకులు అంటున్నారు.

జిల్లాలోని మూడు ఎస్టీ నియోజక వర్గాలు, ఒక ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలో అధికారపార్టీ పైకి చూడడానికి బలంగా కనిపిస్తోంది. కానీ తాజా ఎన్నికల్లో వైసిపి సిటింగ్ ఎమ్మెల్యే లందరికీ ముచ్చెమటలు పట్టాయని చెప్పొచ్చు. ఓటింగ్ సరళిని పరిశీలిస్తే నలుగురు సిటింగ్ ఎమ్మెల్యేల్లో ఎంతమంది విజేతలుగా నిలుస్తారో అంతు చిక్కడం లేదు. ప్రభుత్వ వ్యతిరేకత కన్నా స్థానిక ఎమ్మెల్యేలపై ప్రజావ్యతిరేకత ఎక్కువ గా వుండడంతో కొంతమందికి ఈ ఎన్నికల్లో ఎదురీత తప్పలేదని భావిస్తున్నారు. సాలూరులో ప్రభుత్వ వ్యతిరేకత తప్ప సిటింగ్ ఎమ్మెల్యే గా రాజన్నదొరపై చెప్పుకోదగిన స్థాయిలో ప్రజావ్యతిరేకత లేదు. అయితే టిడిపి అభ్యర్థి సంధ్యారాణి సృష్టించిన సెంటిమెంట్ అస్త్రం ఆమెకు కొంతమేర అనుకూలించినట్లు తెలుస్తోంది. రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయానని, తనకో ఛాన్స్ ఇవ్వాలని కోరుతూ ఆమె ప్రాధేయపడిన తీరు ప్రజల సానుభూతి పొందడానికి దోహదపడింది. ఇలాంటి పరిస్థితుల్లో వైసిపి అభ్యర్థి రాజన్నదొరకు సంధ్యారాణి గట్టి పోటీ ఇచ్చారు. పార్వతీపురం నియోజకవర్గంలో సిటింగ్ ఎమ్మెల్యే అలజంగి జోగారావు కూడా రెండోసారి బరిలో వున్నారు. గత ఐదేళ్లలో ఆయన ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్నారని ప్రచారం జరిగింది. విచ్చలవిడి అవినీతి ఆరోపణలు, భూకబ్జా వంటి అంశాలు అధికారపార్టీ ఎమ్మెల్యేగా జోగారావు పై సొంత పార్టీ లోనే వ్యతిరేకతను పెంచేశాయి. ఈ నేపథ్యంలో ఆయన గెలుపు అంత సునాయాసం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. డబ్బు మంచినీరు మాదిరి ఖర్చు చేయడం, టిడిపిలో గ్రూపు రాజకీయాలు వల్ల వైసిపి అభ్యర్థి జోగారావు అతి కష్టంగానైనా గట్టెక్కవచ్చునని ప్రచారం జరుగుతోంది. ఇక కురుపాం నియోజకవర్గం లో మాజీ మంత్రి, సిటింగ్ ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి అందరి కన్నా ఎక్కువ గడ్డు పరిస్థితిని ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. ఇక్కడ కూడా ఆమె ఊహించని రీతిలో ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి విడత లోనే డిప్యూటీ సిఎం పదవి పొందిన పుష్ప శ్రీవాణి తమను పట్టించుకోకపోవడం పట్ల గిరిజనుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. గిరిజన ఎమ్మెల్యే గా ఆమె రెండు సార్లు గెలిచినా గిరిజన సమస్యల పట్ల నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలు వైసిపిపై అసంతృప్తిని తారాస్థాయికి తీసుకెళ్లాయని చెప్పొచ్చు. పాలకొండలోనూ సిటింగ్ ఎమ్మెల్యే వి.కళావతి కొంత మేర గడ్డు పరిస్థితిని ఎదుర్కొన్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. పేరుకే ఎమ్మెల్యేగా వున్నప్పటికీ ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కనుసన్నల్లో పని చేయడం, అవినీతి ఆరోపణలు అధికారపార్టీ పై ప్రతికూల ప్రభావం చూపించే అవకాశాలు ఉన్నాయి. అయితే ప్రతిపక్ష కూటమి నాయకుల మధ్య అంతర్గత విభేదాలు కళావతికి మేలు చేస్తాయనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ప్రభుత్వంపై వ్యతిరేకత, సిటింగ్ ఎమ్మెల్యే లపై అసంతప్తి వెరసి అధికారపార్టీకి మన్యం జిల్లా లో చెమటలు పట్టించాయని చెప్పొచ్చు. అధికారపార్టీ నాయకులు పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా లోలోన వారిని ఓటమి భయం వెంటాడుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

# ఎన్నికలు ముగిసినా నిర్లక్ష్యం వద్దు

## విశాఖపట్నం రేంజ్ డిఐజి విశాల్ గున్ని

**ప్రజాశక్తి-విజయనగరం కోట**

ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలు తరువాత జరిగిన సంఘటనలు, తీసుకోవాల్సిన భద్రత చర్యలపై విశాఖపట్నం రేంజ్ పరిధిలోని విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పిలు, ఇతర పోలీసు అధికారులతో విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం సమీక్షా సమావేశం మరియు జూమ్ మీటింగు నిర్వహించారు.

ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ - గత రెండునెలలుగా రేంజ్ పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది చాలా కష్టపడి, ప్రణాళికాబద్ధంగా క్షేత్ర స్థాయిలో సమర్ధవంతంగా పని చేయడం వల్ల ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చిన్న చిన్న సంఘటనలు మినహా ప్రశాంతయుతంగా నిర్వహించుకోగలిగామని చెప్పారు. అందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ఎన్నికల తరువాత మన ప్రాంతం ప్రశాంతంగా ఉందన్న నిర్లక్ష్యం వద్దని, మరో 15రోజులు ప్రతీ ఒక్కరూ ఇదే స్ఫూర్తి, నిబద్ధతతో పని చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులు ఉన్నాయని, మన ప్రాంతంలో ఎటువంటి శాంతిభద్రతల సమస్యలూ ఉత్పన్నం కాకుండా క్షేత్ర స్థాయిలో మరింత సమర్ధవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పోలింగుకు కొద్ది రోజులు ముందు, పోలింగు రోజు, పోలింగు తరువాత గ్రామాల్లోచోటు చేసుకున్న చిన్న చిన్న సంఘటనల పట్ల నిర్లక్ష్యం వద్దని, ఆయా గ్రామాలను అధికారులు పలుమార్లు సందర్శించాలని, గ్రామ పెద్దలు, గ్రామస్థులతో మమేకమై, వారిని వివాదాలకు దూరంగా ఉండాలని, ఒకరితో ఒకరు శాంతియుతంగా మెలగాలని విజ్ఞప్తి చేయాలన్నారు.

గ్రామాల్లో చురుకుగా ఉన్న వ్యక్తులను, రాజకీయంగా వివాదాలు సష్టించే వ్యక్తులను గుర్తించి, వారిని పోలీసు స్టేషనుకు పిలిచి, కౌన్సిలింగు చేయాలని, క్షేత్ర స్థాయిలో రాజకీయ పార్టీలకు అతీతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఓటు వేసేందుకు ఇతర ప్రాంతాల నుండి స్వగ్రామాలకు వచ్చిన వ్యక్తులు వలన ఏమైనా సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న వారిని గుర్తించి, వారిపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలన్నారు. వివాదాలు తలెత్తేందుకు అవకాశం ఉన్న గ్రామాలను గుర్తించి, పోలీసు పికెట్లును ఏర్పాటు చేయాలని, ఆయా గ్రామాల్లో పరిస్థితులను, సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలపాలన్నారు. గ్రామాల్లోకి క్రొత్తగా వచ్చే వ్యక్తులను గుర్తించి, వారు గ్రామానికి ఏ పని మీద వచ్చినది, ఎందుకు వచ్చినది తెలుసుకోవాలని, ఆయా అంశాలను పాయింట్ బుక్కుల్లో నమోదు చేయాలన్నారు. స్థానిక నాయకులు పోలీసు స్టేషనుకు వచ్చే ఫిర్యాదులను తమ రాజకీయ అవసరాలకు వాడుకునే అవకాశం ఉన్నందున, ఏ చిన్న ఫిర్యాదు వచ్చినా, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలన్నారు. ఇవిఎంలను భద్రపర్చిన స్ట్రాంగు రూమ్స్ వద్ద మూడంచెల భద్రతను ఇప్పటికే ఏర్పాటు చేసామని, వాటిని నిరంతరం అధికారులు తనిఖీలు చేపట్టి, భద్రతను పర్యవేక్షించాలన్నారు. రాబోయే 15 రోజులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఏ చిన్న సంఘటనను తేలికగా తీసుకోవద్దని, రాజకీయాలకు అతీతంగా పని చేయాలని, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, వివాదాలు జరిగేందుకు అవకాశం ఉన్న గ్రామాలను, వ్యక్తులను గుర్తించి, ప్రత్యేకంగా నిఘా పెట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం, ఎన్నికల తరువాత వివిధ పోలీసు స్టేషనుల్లో నమోదైన కేసులను విశాఖ రేంజ్ డిఐజి సమీక్షించి దర్యాప్తులో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. జూన్ 4న జరిగే కౌంటింగు నిర్వహించే కేంద్రాల వద్ద కూడా భద్రత ఏర్పాట్లు చేపట్టాలని, వాటిని జిల్లా ఎస్పిలు ముందుగానే సమీక్షించాలని డిఐజి ఆదేశించారు.

సమావేశంలో విజయనగరం జిల్లా ఎస్పి ఎం. దీపిక, మన్యం జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్, శ్రీకాకుళం జిల్లా ఎస్పి జిఆర్ రాధిక, అనకాపల్లి జిల్లా ఎస్పి కెవిమురళీ కృష్ణ, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పితుషీం సిన్హా విజయనగరం ఎఎస్పిలు అస్మా ఫర్వీన్, శ్రీకాకుళం ఎఎస్పి ప్రేమ్ కాజల్, పార్వతీపురం మన్యం ఎఎస్పి ఒ.దిలీప్ కిరణ్, పార్వతీపురం ఎఎస్పి సునీల్ షరోన్, ట్రైయినీ ఐపిఎస్ ఎం.జావలి, డిఎస్పిలు, సిఐలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఐజి విశాల్ గున్ని

## పోస్టల్ బ్యాలెట్లు స్ట్రాంగ్ రూమ్‌లో భద్రం

**ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్**

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అరకు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, పాడేరు నియోజక వర్గాల పోస్టల్ బ్యాలెట్‌లను పార్వతీపురం లోని ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల రిటర్నింగ్ అధికారుల సమక్షంలో గురువారం భద్రపరిచారు. అరకు పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నిశాంత్ కుమార్ రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలన అనంతరం స్ట్రాంగ్ రూమ్‌ను సీల్ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు నియోజక వర్గాలతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని రంపచోడవరం, పాడేరు, అరకు న్నియోజకవర్గ పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ లను భద్రపర్చుతున్నట్టు తెలిపారు. స్ట్రాంగ్ రూము వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందని ఆయన చెప్పారు. ఎటువంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ప్రతీ రోజూ వచ్చే సర్వీస్ ఓట్లను పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాటుచేసిన బ్యాలెట్ బాక్స్ లో నిక్షిప్తం గా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో అరకు పార్లమెంటరీ సహాయ రిటర్నింగ్ అధికారి, జెపి ఎస్ఎస్ శోబిక, పాలకొండ, సాలూరు, కురుపాం, పార్వతీపురం ఆర్ఒలు సి.విష్ణు చరణ్, శుభం బన్సల్, వివి.రమణ, కె.హేమలత, కంట్రోల్ రూమ్ ఇన్చార్జి , ఎస్ డి సి అర్.సూర్య నారాయణ, ఇన్చార్జి డిఆర్ఒ కేశవ నాయుడు, 234 బెటాలియన్ బి కంపెనీ సి ఆర్ పి ఎఫ్ అసిస్టెంట్ కమ్యాండెంట్ వినిత, రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ ఓటింగ్‌పైనే అందరి దృష్టి

**ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్**

పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సోమవారం జరిగిన సార్వత్రిక ఓటింగ్‌లో ప్రధాన ప్రత్యర్థులైన వైసిపి, టిడిపిలు గెలుపు మాదేనంటూ పైకి చెబుతున్నప్పటికీ లోపల ఓటమి భయం ఇరు పార్టీల నాయకులను వెంటాడుతుంది. ఎన్నికలు జరిగిన తీరును టిడిపి విశ్లేషిస్తూ ప్రజలు తమకు అనుకూలంగా ఓటు వేయడంతో గౌరవప్రదమైన మెజారిటీతో అలజంగి జోగారావుపై గెలుస్తామని బల్ల గుద్ది మరీ చెబుతున్నారు. వైసిపి నాయకులు కూడా మహిళలు, పింఛనుదారులతో పాటు సంక్షేమ పథకాల లబ్ధిదారులు తమను ఆదరించి ఎలాగైనా ఎమ్మెల్యేను గెలిపించుకోవాలనే ఉద్దేశంతో అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్నారని భావిస్తున్నారు. పార్వతీపురం మున్సిపాలిటీలో తమ అభ్యర్థికి ఎనలేని ఆదరణ ఉందని 30 వార్డుల్లోనూ ఓటర్లు తమకు అనుకూలంగా ఓటు వేశారని, గతంలో టిడిపిపై తమకు లభించిన 24వేల ఓట్లు మెజార్టీ కాకపోయినా కనీసం 10వేల ఓట్ల మెజారిటీతో రెండోసారి జోగారావు విజయం సాధిస్తారని చెబుతున్నారు. బయటకు ఇలా చెబుతున్నప్పటికీ మున్సిపాలిటీలో ఈసారి టిడిపికి అనుకూలంగా ఓటింగ్ జరగడమే కాకుండా ఏకపక్షంగా జరిగిందన్న వార్తలు మాత్రం వైసిపికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎన్నికలకు రెండు రోజులు ముందుగా వైసిపి పట్టణంపై ప్రత్యేక దృష్టి స్థానిక నాయకులను, కౌన్సిలర్లను అప్రమత్తం చేసి అన్ని వార్డుల్లోనూ ధనాన్ని వరదలా పారించారని, ఒక్కో ఓటుకు 2వేలు రూపాయలు చొప్పున వెదజల్లడంతో ఆ ప్రభావం వల్ల ఓటర్లు ప్రలోభ పడి టిడిపికి ఓట్లు వేయలేదన్న వాదన కూడా ఒకటి టిడిపిని నిరాశ పరుస్తుంది. పార్వతీపురం మున్సిపాలిటీలో పోలైన దాదాపు 29వేలకు పైగా ఓట్లు ఏ పార్టీకి వెళ్లాయి అన్న ఖచ్చితమైన లెక్కలు లేకపోవడంతో పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నప్పటికీ, ఇరు పార్టీలకు చెందిన చోటా నాయకులు ఒక్కొక్కలు విశ్లేషకులుగా మారి విజయం తమదంటే తమదంటూ రచ్చబండల దగ్గర హడావిడి చేస్తున్నారు. ఏది ఏమైనపటికీ పార్వతీపురం పట్టణ ఓటరే విజేతను నిర్ణయించడంలో కీలక పాత్ర వహిస్తారని అందరూ అంగీకరిస్తున్నారు.

### అభ్యర్థుల్లో ఉత్కంఠ

**సీతానగరం :** మండలంలోని మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఓటింగ్ సరళి చూసి తెలుగుదేశం, వైసిపి అభ్యర్థుల్లో తీవ్రస్థాయిలో ఉత్కంఠ నెలకొంది. మండలంలో 35 పంచాయతీలు 62 పోలింగ్ కేంద్రాల్లో 46,786 ఓట్లు ఉండగా, అందులో 38,482 ఓట్లు పోలయ్యాయి. సగం పంచాయతీల్లో టిడిపి అభ్యర్థికి ఎక్కువ ఓట్లు వస్తాయని, మిగతా సగం పంచాయతీల్లో వైసిపికి ఆధిత్య వస్తుందని తెలిపారు. దీన్నిబట్టి ఏ అభ్యర్థికైనా మండలంలో 1500 ఓట్లు మెజార్టీ వస్తుందని ఆయా పార్టీల నాయకులు అంచనా వేస్తున్నారు. ఏది ఏమైనా జూన్ 4 వరకు వేచి చూడాల్సిందే.

# డెంగీ నివారణలో భాగస్వాములు కావాలి

**ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్**

డెంగీ వ్యాధి నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయపార్వతి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు పిలుపు నిచ్చారు. ఈ మేరకు వైద్య సిబ్బందితో కలిసి వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ప్రాంగణంలో జాతీయ డెంగీ దినోత్సవం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎడిస్ దోమల ద్వారా డెంగీ వ్యాధి వ్యాప్తి చెందుతుందని హఠాత్తుగా వచ్చే తీవ్రమైన జ్వరంతో మొదలవుతుందని, ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పి, శరీరంపై రాష్, వాంతి వికారం, రక్తస్రావం మొదలగు లక్షణాలుంటాయన్నారు. త్వరగా గుర్తించడం ద్వారా డెంగీ వ్యాధి తీవ్రత కాకుండా జాగ్రత్త పడవచ్చని, నివారణ సులభ మార్గమని ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అన్నారు. సమర్ధవంతంగా ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాలు చేపట్టడం, దోమల లార్వా వృద్ధి చెందే స్థావరాలను గుర్తించి తొలగించడం, నీటి తొట్టెలపై మూతలు ఉంచడం, దోమతెరలు వినియోగించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో, క్షేత్ర స్థాయిలో డెంగీ నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. సమాజ భాగస్వామ్యంతో డెంగీ వ్యాధి నివారణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్, ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ నగేష్ రెడ్డి, డెమో యోగీశ్వం రెడ్డి, నాగేంద్ర, హెల్త్ సూపర్వైజర్లు, కార్యాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**జియ్యమ్మవలస :** ప్రపంచ డెంగీ దినోత్సవం సందర్భంగా జియ్యమ్మవలస, రావాడరామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రల్లో, చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రంలోనూ వైద్యాధికారి జగదీష్, అనిల్ కుమార్, డాక్టర్ శంకర్రావు ర్యాలీ కార్యక్రమాలను నిర్వహించి ప్రజలకు డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించారు. ప్రజలు దోమతెరలను ఉపయోగించి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**కురుపాం :** డెంగీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రావాడ రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారి చీకటి శంకరావు అన్నారు. జాతీయ డెంగీ వ్యాధి దినోత్సవం పురస్కరించుకొని గురువారం కురుపాం సంతలో డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**సీతానగరం :** స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం నుంచి బజారు వరకు జాతీయ డెంగీ దినోత్సవ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు జాగ్రత్తలపై వైద్యాధికారులు సూచించారు. అలాగే పెదంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎం.రాధా కాంత్, నిహారిక, సూపర్వైజర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**వీరఘట్టం :** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి ,ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా పలు అంశాలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రదీప్, సూపర్వైజర్ జనార్దన్ రావు, ఎం ఎల్ హెచ్ పీ లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న అధికారులు, సిబ్బంది

# గజానికో గొయ్యి...

## అధ్వానంగా అంతర్ రాష్ట్ర రహదారి

**ప్రజాశక్తి - కొమరాడ**

ప్రధాన రహదారులైన అంతర్‌రాష్ట్ర రహదారి అధ్వానంగా గోతులు ఏర్పడడంతో వాహనదారులు నిత్యం అవస్థలు పడుతూ ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పార్వతీపురం నుంచి కూనేరు అంతర్‌రాష్ట్ర రహదారి గత ఐదేళ్లుగా అధ్వానంగా మారి అనేక ప్రమాదాలకు నిలయాలుగా మారుతుంది. ఐదేళ్ల నుంచి సిపిఎం ఆధ్వర్యంలో పలుమార్లు ఆందోళనలు, నిరసనలు చేయడంతో కొంతమేరకు అధికారులు స్పందించి అక్కడక్కడ గోతులు కప్పి మరమ్మతులు చేశారు. మరికొన్ని ప్రదేశాల్లో పూర్తిగా గోతులైనప్పటికీ పట్టించుకోకపోవడంతో అవి కాస్త ఇప్పుడు పెద్ద గోతులుగా మారి ప్రమాదాలకు పిలుపునిస్తున్నాయి. చోళపదం శివాలయం, కొమరాడ గ్రామ సమీపంలో రెండు చోట్ల అంతర్ రాష్ట్ర రహదారిపై భారీ గోతులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఈ గోతుల్లో నిత్యం లారీలతో పాటు చిన్న చిన్న వాహనాలు మరమ్మతులకు గురై గోతుల్లో నిలిచిపోతున్నాయి. ముఖ్యంగా గోతుల వద్ద చిన్న కార్లు, గోతులు దిగిపోయి మరమ్మతులు గురవ్వడంతో లక్షల్లో మదుపులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. గత వారం రోజుల నుంచి స్వల్పంగా పడుతున్న వర్షాలకు గోతుల్లో భారీగా వాట్సాప్ నీరు చేరడంతో గోతులు కనిపించక కార్లు, ద్విచక్ర వాహనదారులు గోతుల్లో పడిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో గోతుల్లో దిగిపోవడంతో వాహనాలు సైతం మరమ్మతులకు గురికాగా, ప్రజలు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలవుతున్నారు. రోడ్లన్నీ దారుణంగా తయారవ్వడంతో గర్భిణులు, వృద్ధులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు సైతం తమపంటను మిల్లులకు తరలించేందుకు అధిక కిరాయిలు చెల్లించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రోడ్లపై గోతులకు భయపడి ఆటోవాలాలైతే అసలు కిరాయికి రావడానికి సైతం భయపడుతున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులను కప్పి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

గోతులో చిక్కుకున్న కారు

## ఎన్నికల రెమ్యునరేషన్ చెల్లింపుపై డిఆర్ఒ హామీ

**ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్**

ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల రెమ్యునరేషన్ చెల్లింపులు తేడాలను డిఆర్ఒ దృష్టికి తీసుకువెళ్లగా చెల్లింపులకు హామీలు ఇచ్చారని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.మురళి, ఎస్.మురళీమోహనరావు తెలిపారు. ఈ మేరకు గురువారం డిఆర్ఒను వారు కలిసి ఎన్నికల చెల్లింపు విషయంపై వినతి అందించారు. సమస్యను సవివరంగా వారికి వివరించగా దీనిపై డిఆర్ఒ స్పందిస్తూ రిటర్నింగ్ అధికారులకు వెంటనే ఫోన్ చేసి తేడాలని సవరించాలని, పాలకొండ నియోజక వర్గంలో రిజర్వుపడిన ఉపాధ్యాయులకు వెంటనే రెమ్యునరేషన్ చెల్లించాలని, పిఒ, ఎపిఒలుగా రిజర్వ్ బాధ్యతలు నిర్వహించిన వారికి ట్రైనింగ్ డబ్బులు చెల్లిస్తామని తెలిపారు. అదనంగా శిక్షణ ఇచ్చిన వారికి ఆర్వోలతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. డ్యూటీ సర్టిఫికెట్లు వెంటనే పంపిణీ చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. పిఒ, ఎపిఒలకు సమానంగా రెమ్యూనిరేషన్ చెల్లించేందుకు సంబంధిత అధికారులు నుండి క్లారిఫికేషన్ తీసుకుంటామన్నారు

## పథకాల సొమ్ము లబ్ధిదారుల ఖాతాలో జమచేయాలి : సిఐటియు

**ప్రజాశక్తి - పాలకొండ**

రైతులకు పెట్టుబడి రాయితీ (ఇన్పుట్ సబ్సిడీ), విద్యాదీవెన, చేయూత, ఆసరా, ఇబిసి నేస్తం వంటి పథకాలకు నిధులను వెంటనే లబ్దిదారుల ఖాతాల్లో జమచేయాలని సిఐటియు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఫిబ్రవరి, మార్చి మాసాల్లోనే ముఖ్యమంత్రి రైతుల పెట్టుబడి రాయితీ, విద్యాదీవెన, ఆసరా వంటి పథకాలకు బటన్ నొక్కినా ఆయా పథకాల లబ్ధిదారులకు నగదు జమ కాలేదని తెలిపారు. ఈనెల 10, 11 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో నగదు మొత్తాన్ని వేసేందుకు సిద్ధపడిందని పేర్కొన్నారు. ఎన్నికల కారణంగా పోలింగు ముగిసేంత వరకు లబ్దిదారుల ఖాతాల్లో ఎలాంటి నగదు బదిలీ చేయకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశించిందని వివరించారు. మే 13న పోలింగు ముగిసిన నేపథ్యంలో ఆయా పథకాల లబ్దిదారుల ఖాతాల్లో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు.

**పార్వతీపురం టౌన్ :** ఎన్నికల కారణంగా నిలిపేసిన పథకాల డబ్బులు రైతులకు పెట్టుబడి రాయితీ (ఇన్పుట్ సబ్సిడీ), విద్యాదీవెన, చేయూత, ఆసరా, ఇబిసి నేస్తం వంటి పథకాలకు నిధులను వెంటనే లబ్దిదారుల ఖాతాల్లో జమ చేయాలని సిపిఎం పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. గురువారం సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, సభ్యులు పాకల సన్యాసిరావు మాట్లాడుతూ, ఫిబ్రవరి, మార్చి మాసాల్లోనే ముఖ్యమంత్రి రైతుల పెట్టుబడి రాయితీ, విద్యాదీవెన, ఆసరా వంటి పథకాలకు బటన్ నొక్కినా ఆయా పథకాల లబ్ధిదారులకు నగదు జమ కాలేదన్నారు. అయితే మే 10, 11 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో నగదు మొత్తాన్ని వేసేందుకు సిద్ధపడిందని, ఎన్నికల కారణంగా పోలింగు ముగిసేంత వరకు లబ్ధిదారుల ఖాతాల్లో ఎలాంటి నగదు బదిలీ చేయకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశించిందని వివరించారు. మే 13తో పోలింగు ముగిసిన నేపథ్యంలో ఆయా పథకాల లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు.

**కొమరాడ :** రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల లబ్ధిదారులకు సంబంధించిన నగదును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. స్థానిక విలేకరులుతో ఆయన మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి (ఇన్పుట్ సబ్సిడీ), విద్యా దీవెన, చేయూత, ఆసరా, ఇబిసి, నేస్తం వంటి పథకాలకు వెంటనే నిధులు విడుదల చేసి ఖాతాదార్ల బ్యాంకు ఖాతాలు వేయాలని కోరారు. లేకుంటే లబ్ధిదారులతో కలిసి ఎంపిడిఒ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఇసుకను ఎడ్ల బళ్లకు ఎత్తుతున్న అక్రమార్కులు

## అక్రమంగా ఇసుక తరలింపు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని ఎటువంటి అనుమతుల్లేకుండా అక్రమంగా నాటుబండ్లతో ఇసుకను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని లక్ష్మీపురం మాజీ ఎంపిటిసి దాసర నాగరత్నం భూగర్భశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చల్లంనాయుడువలసలో సువర్ణముఖీ నది ఇసుకను ఎటువంటి అనుమతుల్లేకుండా నాటు బళ్లపై తరలిస్తున్నారన్నారు. అలాగే ట్రాక్టర్లపైనా కూడా అక్రమంగా ఇసుకను తరలించి వేలాది రూపాయలకు బ్రోకర్లు అమ్ముకుంటున్నారని ఆమె అన్నారు. ఇసుక తవ్వకాలతో ఎక్కడికక్కడ గుంతలు ఏర్పాటుతో అందులో ప్రజలు పడిపోయి మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల క్రితం ముగ్గురు పిల్లలు గొంతులో పడిపోయి చనిపోయారని తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన రోడ్లకు, భవనాలకు, దేవాలయాలకు, ఇళ్ల నిర్మాణాలకు సచివాలయం ద్వారా అనుమతులు పొందిన వారికి ఉచితంగా ఇసుక సప్లై చేసి అక్రమంగా తరలిస్తున్న వారిపై జిల్లా అధికారి యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న డైరెక్టర్ శ్రీనివాసరావు

## విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక భాస్కర్ డిగ్రీ కళాశాలలో ఐదుగురు విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయని ఆ కళాశాల డైరెక్టర్ బి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గాయత్రి విద్యా పరిషత్ విశాఖపట్నంలో నిర్వహించిన ఉద్యోగ నియామకాలలో తమ కళాశాలకు చెందిన డిగ్రీ విద్యార్థులు పి జ్యోత్స్న, ఏ హర్షత, ఓ వినీల, డి వాసవి, ఏ కోహమ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలో ఏడాదికి రెండు లక్షల ప్యాకేజీకి ఎంపికయ్యారన్నారు. వీరిని డైరెక్టర్ బి శ్రీనివాసరావు, కో డైరెక్టర్ సురేష్, ప్రిన్సిపాల్ ఎం రవి శాస్త్రి, అధ్యాపకులు అభినందించారు. వీరితో పాటు భాస్కర్ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు మంచి ప్రతిభావంతులుగా ఎదగాలని కోరారు.

## వీరఘట్టంలో జోరుగా బెట్టింగులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వైసిపి, జనసేన పార్టీలకు చెందిన అభిమానులు నాయకులు జోరుగా బెట్టింగులు కాస్తున్నారు. వైసిపి నుంచి ఎమ్మెల్యే వి. కళావతి విజయం ఖాయమని కళావతి గ్రూపు, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ గ్రూపు జోరుగా పందేలు కాస్తున్నారు. నిమ్మక జయకృష్ణ విజయం సాధిస్తాడని చాలా మంది రెండేసి లక్షలు పందేం కాసినట్లు సమాచారం. మరో వ్యక్తి జయకృష్ణ గెలుస్తాడని రూ.10లక్షలు పందేం కాసేందుకు సిద్ధంగా ఉన్నాడని అయినా వైసిపికి చెందిన వారేవరూ ముందుకు రావడం లేదన్న ప్రచారం కూడా సాగుతోంది. మరికొన్ని చోట్ల వైసిపి నాయకులు కూడా రెండేసి లక్షలు పందేం వేసినట్లు సమాచారం. ఈ ఎన్నికలలో మండలంలోని అన్ని గ్రామాల్లోనూ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు పలికినట్లు తెలిస్తోంది. పాలకొండ, భామిని మండలాల్లో కూడా జయకృష్ణకు మద్దతు పలకడంతో కళావతి పై విజయం తథ్యమని పల్లెల్లో ఎక్కడ చూసినా చర్చ జరుగుతోంది. ఏదిఏమైనా వీళ్ళ జాతకాలు బయట పడాలంటే జూన్ 4 వరకు వేచి చూడాల్సిందే.

## ప్రభుత్వ కళాశాలలో చేరండి

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలురు చేరాలని పాలకొండ మండలంలో వివిధ గ్రామాల్లో కళాశాల అధ్యాపకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు స్థానిక జూనియర్ కళాశాలలో అందిస్తున్న కోర్సుల వివరాలు, కళాశాల వసతుల వివరాలు, విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీల వివరాలు గురించి విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కళాశాలలో అనుభవం గల అధ్యాపకులు, నాడు-నేడు ద్వారా అందంగా రూపుదిద్దుకున్న కళాశాల, లేబొరేటరీలు, ఐఎఫ్‌పి ప్యానెల్స్ ద్వారా డిజిటల్ విద్యాబోధన, ఎంసెట్, నీట్ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వబడుతుందని అధ్యాపకులు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ హరగోపాల్ పర్యవేక్షణలో సిబ్బంది, అధ్యాపకులు మండలంలోని తలవరం, బెజ్జి, పారాపురం, నీలానగరం, తెట్టంగి తదితర గ్రామాల్లో పర్యటించారు.

## 18న వాసవీమాత జయంతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా ఈనెల 18న ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం దేవాలయం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాలయం గౌరవ అధ్యక్షులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సలహాలు సూచనలతో అధ్యక్షుడు నారాయణం శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమ్మవారి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శనివారంఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు పి.ప్రకాష్, రవికుమార్, కట్టమూరి రత్నారావు, వజ్రపు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ కె.రవికుమార్

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి - సీతానగరం

శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని సిఐ కె.రవికుమార్ హెచ్చరించారు. మండలంలోని పెదబోగిలి, చినబోగిలి, బూర్జ, నిడగల్లులో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి గొడవలు జరగకుండా 144 సెక్షన్ అమల్లో ఉందని తెలిపారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ పార్టీకి చెందిన నాయకులు గానీ, ప్రజలు గానీ తగాదాలకు దూరంగా ఉండాలని, శాంతిభద్రతలను కాపాడాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎస్సై ఎం.రాజేష్, పోలీస్ సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పోలింగ్ ముగిసింది. కౌంటింగే మిగిలింది. ఈ నేపథ్యంలో ఎక్కడ ఎవరు గెలుస్తారోనన్న చర్చ జిల్లా వ్యాప్తంగా సాగుతోంది. ఏ ఇద్దరూ కలిసినా ఒకటే చర్చ .. ఆ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు? ఇక్కడ ఎవరు ఓడిపోతారోనని ఒకటే చర్చ. ఈ క్రమంలో అంతేస్థాయిలో పందేలు ఊపందుకున్నాయి. కొందరు గెలుపు ఓటములపై పందేలా కాస్తే, మరికొందరు మెజార్టీపై బెట్టింగ్‌లు పెడుతున్నారు. ఇప్పటివరకూ ఐపిఎల్ క్రికెట్‌లో పందేలు కాయడం చూసిన ప్రజలు తాజాగా ఎన్నికల్లో గెలుపు ఓటములపై కోట్లాది రూపాయలు పందేలు జరగడం చూసి విస్తుపోతున్నారు.

# కాయ్ రాజా కాయ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్/బొబ్బిలి

**ఎన్నికల ఫలితాలపై జోరుగా పందేలు**

**గెలుపు, మెజార్టీపై భారీగా బెట్టింగ్**

ఉమ్మడి జిల్లాలో 11 నియోజకవర్గాలు ఉన్నాయి. దాదాపు అన్ని చోట్లా టిడిపి, వైసిపి మధ్య హోరాహోరా పోటీ జరిగింది. ఎక్కువ నియోజకవర్గాల్లో ఎవరు గెలుస్తారో చెప్పలేని పరిస్థితి ఉంది. అభ్యర్థుల గెలుపోటములపై ఒక లెక్క అయితే, వచ్చే మెజార్టీపై మరో లెక్క. అంతేకాకుండా ప్రభుత్వం ఏర్పాట్లపై మరో పందేం ఇలా రకరకాలుగా జూదం నడుస్తోంది ఇందులో ఒక్కో నియోజకవర్గంపై ఒక్కో రకంగా పందేలు నడుస్తుండటం గమనార్హం. కొన్నిచోట్ల వైసిపికి చెందిన వారు రూ.లక్ష పెడితే టిడిపికి చెందిన వారు రూ.2లక్షలు, మరికొన్ని నియోజకవర్గాల్లో వైసిపి వారు ఎక్కువ, టిడిపి వారు తక్కువ మొత్తంలో పెట్టి బెట్టింగ్‌లు కాస్తున్నారు. తమ అభ్యర్థులు తప్పనిసరిగా గెలుస్తారన్న అంచనాలే ఇందుకు కారణం. కీలకమైన నాయకులు బరిలో ఉన్న చోట పందేలు కూడా ప్రతిష్టాత్మకంగానే మారుతున్నాయి.

ప్రధానంగా విజయనగరం, బొబ్బిలి, ఎస్.కోట, గజపతినగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి నియోజకవర్గాల్లో ఎక్కువగా పందేలు జరుగుతున్నాయి. విజయనగరం అసెంబ్లీ స్థానంలో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయనే అంశం మొదలుకుని కీలకమైన అభ్యర్థులు సాధించే మెజార్టీల వరకు అన్నింటిపైనా బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. వేలల్లో, లక్షల్లో పందేలు సాగుతుండటం విశేషం. నియోజకవర్గంలో టిడిపి కూటమి, వైసిపి అభ్యర్థుల విజయావకాశాలపై బెట్టింగులు జోరుగా సాగుతున్నాయి. దీంతో ప్రధాన పార్టీల, అభ్యర్థుల గెలుపోటములను విశ్లేషించేందుకు ఆయా పార్టీలవారీగా రాజకీయ నిపుణులు రంగంలోకి దిగారు. వీరు బూత్‌ల వారీగా పోలైన ఓట్ల వివరాలు, వాటిలో యువత ఎంతమంది, మహిళలు ఎంత మంది అనే వివరాలు సేకరించి పార్టీలకు ఓట్లు ఎలా పడి ఉంటాయని అంచనాకు వస్తున్నారు. ఆయా బూత్‌ల్లో పార్టీలకు ఉన్న పట్టును కూడా పరిగణనలోకి తీసుకుని గెలుపోటములను అంచనా వేస్తున్నారు. బూత్‌లవారీ లెక్కలు వేసుకుని ఒక అంచనాకు వచ్చిన తర్వాత బెట్టింగ్ కోసం సమాచారాన్ని పంపుతున్నారు.. బెట్టింగ్ బాబుల్లో అధికశాతం ఈసారి ప్రధాన పార్టీల ద్వితీయశ్రేణి నాయకులే ఉండటం గమనార్హం. బెట్టింగ్ కు ముందుకొచ్చిన వారు ముందుగా ఒప్పంద పత్రం రాసుకుంటున్నారు. ఇద్దరూ కలిసి ఒక నమ్మకమైన వ్యక్తి దగ్గర బెట్టింగ్ మొత్తాన్ని ఉంచుతున్నారు. ఫలితం తేలిన తర్వాత ఆ వ్యక్తి ఒప్పందం ఆధారంగా నగదును ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా మధ్యవర్తులుగా ఉన్నవారికి భారీగానే గిట్టుబాటవుతోంది. పందెం మొత్తంలో 5 నుంచి 10 శాతం కమీషన్ రూపేణా మధ్యవర్తులకు అందజేయాలని ఒప్పందం కుదుర్చు కుంటున్నారు. వారువేసుకున్న లెక్కలు ఆధారంగా కొంతమంది 100కు 80, మరి కొంతమంది 100 కి 100 అంటూ పందేలు కాస్తున్నారు. డబ్బులు లేని వారు బంగారం,భూములు , కొన్ని వస్తువులకు కూడా పందేలు కాస్తున్నారు.

విజయనగరం నియోజకవర్గంలో ఇప్పటికే సుమారు రూ.30 కోట్ల మేర బెట్టింగులు జరిగినట్లు అంచనా. జూన్ 4న ఫలితాలు వెలువడే నాటికి ఈ బెట్టింగులు రెట్టింపయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో జోరుగా బెట్టింగులు జరుగుతున్నాయి. టిడిపి, వైసిపికి చెందిన వారు ఎక్కువగా పందేలు కాస్తున్నారు. బేబినాయన గెలుస్తారని రూ.ఒక లక్ష పెడితే వైసిపి గెలుస్తుందని రూ.50 వేలు బెట్టింగ్ వేస్తున్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని కొంతమంది బెట్టింగ్ వేయగా వైసిపి అధికారంలోకి వస్తుందని మరికొంతమంది బెట్టింగులు వేస్తున్నారు. బొబ్బిలి పట్టణం, రామభద్రపురం, బాడంగి, తెర్లాం, బొబ్బిలి మండలాల్లో టిడిపి, వైసిపి కార్యకర్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు బెట్టింగులు కాస్తున్నారు. కమీషన్ కోసం కొంతమంది బ్రోకర్లు ఇరు పార్టీల మద్దతుదారులను బెట్టింగులకు ప్రోత్సహిస్తున్నారు.

## 28న మండల సమావేశం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 28న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు ఉదయం 10.30 గంటలకు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

## తాగునీటి కోసం అవస్థలు

ప్రజాశక్తి -వీరఘట్టం

తమ వీధులకు రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీటి సరఫరా చేయాలని మండల కేంద్రంలోని గెడ్డ కాలనీ, బాబు జగ్జీవన్ రావు కాలనీ, కస్పా వీధులకు చెందిన దళిత మహిళలు కోరుతున్నారు. తమ వీధులకు కుళాయిపాంట్లు ద్వారా పూర్తిస్థాయిలో తాగునీరు రాకపోవడంతో ఎగువప్రాంతానికి వచ్చి మంచినీరు పట్టుకుని వెళ్లి దాహార్తి తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ వీధులకు పూర్తిస్థాయిలో తాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని దళిత మహిళలు కోరుతున్నారు.

## పాఠశాలలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని పి.ఆమిటి, దుమ్మంగి, పెద్ద ఖర్జ గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేసి చిన్నారులకు స్థానికంగా విద్యాబోధన అందించాలని సర్పంచులు, గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో ఇక్కడ ఉన్న ఎయిడెడ్ పాఠశాలల నిర్వహణతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉండేదని, స్థానికంగా విద్యాబోధన చేయడంతో విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ చూపేవారని అన్నారు. అయితే రకరకాల కారణాలతో గ్రామంలో ఉన్న ఎయిడెడ్ పాఠశాలలు ఎత్తివేయడంతో విద్యార్థులు చదువు కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. దీంతో అనేక రకాలుగా ఇబ్బందులు పడుతూ చదువులు సాగించాల్సి వస్తుందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నాటికైనా గ్రామాల్లో పాఠశాలల నిర్వహించి ఏర్పాటు చేసి విద్యార్థులకు స్థానికంగా విద్య అందేలా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## 'ఉపాధి' నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

ప్రజాశక్తి-పాచిపెంట

మాట్లాడుతున్న కోరాడ ఈశ్వరరావు

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కుట్ర మానుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చల్ల గాలినాయుడు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండలంలోని పాంచాలిలోని నారాయణ చెరువు వద్ద పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారు మాట్లాడుతూ ఎర్రజెండా నాయకత్వంలో పోరాడి సాధించుకున్న ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడంలో భాగంగానే రెండు పూటలా పని పెడుతున్నారని, దీనివల్ల కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. చట్టంలో రెండు పూటలా పని పెట్టాలని ఎక్కడా లేదని, రెండు పూటలా పనిచేసిన గిట్టుబాటు కూలి చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పనిచేసిన చోట ఎక్కడా టెంట్లు, మంచినీరు సరఫరా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ తరహాగా రూ.600 రోజు కూలి చెల్లించాలని, 200 రోజులు పనులు ఇవ్వాలని, పని చేసిన చోట మెడికల్ కిట్లు, మౌలిక సదుపాయాలు కల్పించి ఆదుకోవాలని అన్నారు. మేట్లకు రావాల్సిన బకాయి డబ్బులు చెల్లించాలని, ఉపాధి హామీ సక్రమంగా అమలు చేసి కూలీలకు న్యాయం చేయాలని, క్యూబిక్ మీటర్ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు.

## గ్రంథాలయాల్లో పుస్తక పఠనం

ప్రజాశక్తి -గరుగుబిల్లి

గరుగుబిల్లి: మాట్లాడుతున్న మధుసూదనరావు

మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం కార్యక్రమంలో భాగంగా గురువారం పుస్తక పఠనం కార్యక్రమాన్ని నిర్వహించారు. క్విజ్ పోటీలు నిర్వహించడంతోపాటు అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రను విద్యార్థులకు చదివి వినిపించారు. ఆటల పోటీలు తదితర కార్యక్రమాలను ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నామని శాఖా గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదన రావు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జూన్ 11వ తేదీవరకు వేసవి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో ముందుగా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కలిసి గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ మేరకు విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**పాలకొండ :** స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి సెలవుల్లో పిల్లలు ఎండల్లో తిరగకుండా ప్రతి ఏటా వేసవి శిబిరాలు గ్రంథాలయంలో ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇక్కడ విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు, మేథస్సుకు సంబంధించిన ఆటలు ఆడించడం జరుగుతుంది. కార్యక్రమంలో ఎక్కువ మంది పిల్లలు పాల్గొన్నారు. కళా అంకురం డైరెక్టర్ ఫ్యాషన్ డిజైనర్ కుమారి అల్లు ప్రియాంక పిల్లలకు గ్రంథాలయం చిన్న అల్లికలు, దారంతో కొన్ని రకాల బొమ్మలు ఎలా తయారు చేయాలో చెప్పారు. ఆమె పిల్లలకు చిన్న కథలు పుస్తకం చదవడం ద్వారా పిల్లలకు ఆనందం కలుగుతుందని చెప్పారు. ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

ఓటు వినియోగంలో

## పట్టణాల్లో పెరగని ఆసక్తి

- నెల్లిమర్లలో అత్యధికంగా 88.25 శాతం పోలింగ్
- విజయనగరంలో అత్యల్పంగా 71.84శాతం ఓట్ల నమోదు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పాలకపార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులపై నమ్మకం సడలుతోందో లేక రాజకీయాలపైనే ఆసక్తి తగ్గిపోతోందో... ప్రభుత్వ పథకాలు రుచించడం లేదో.. కారణమేదైనా పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల ఆసక్తి తగ్గింది. సార్వత్రిక ఎన్నికల్లో విద్యలకు నిలయంగావున్న విజయనగరంలో ఓటింగ్ శాతం పెరగకపోవడం, ఉమ్మడి జిల్లాలోనే అత్యల్పంగా నమోదు కావడం ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. విజయనగరం జిల్లాలోని ఏడు, పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో విజయనగరం నియోజకవర్గంలో అత్యల్పంగా 71.84శాతం ఓట్లు మాత్రమే నమోదు అయ్యాయి. ఇదే నియోజకవర్గంలో 2014లో 71.71.28శాతం, 2019లో 70.81శాతం ఓట్లు నమోదయ్యాయి. దీన్నిబట్టి విజయనగరంలో ఓటింగ్ పెద్దగా పెరుగుదల లేదన్నది అర్థమౌతోంది. ప్రస్తుత ఎన్నికల్లో మొత్తంగా 2,67,205 మంది ఓటర్లు ఉండగా కేవలం 1,84,787మంది మాత్రమే తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఓటుహక్కు వినియోగించుకున్న వారిలో పురుషులు 89,886 మంది కాగా, మహిళలు 94,894 మంది ఉన్నారు. మరో ఏడుగురు థర్డ్ జెండర్స్ ఉన్నారు. దీన్నిబట్టి ఓటర్ల సంఖ్యలోనూ, ఓటు హక్కు వినియోగించుకున్నవారిలోనూ పురుషులకన్నా మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారన్నది కూడా స్పష్టమౌతోంది. ఇదే నియోజకవర్గానికి ఆనుకునివున్న నెల్లిమర్ల నియోజకవర్గంలో అత్యధికంగా 88.25శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. ఇక్కడ తొలి నుంచీ ఓటర్ల చైతన్యం ఎక్కువగా కనిపిస్తోంది. ఇక్కడ 2019లో 87.81శాతం, 71.28శాతం ఓట్లు నమోదయ్యాయి. ఈయా ఎన్నికల్లో సగటు నియోజకవర్గ ఓటరు సరళిని పరిశీలిస్తే ఈ నియోజకవర్గంలోనే అత్యధికం శాతం ఓట్లు నమోదయ్యాయి. ప్రస్తుత ఎన్నికల్లో మొత్తం 2,13,551 మంది ఓటర్లకుగాను 1,88,456 ఓట్లు మొదయ్యాయి. ఇక్కడ వలసఓటర్లను సమీకరించడంలో ఇటు వైసిపి, అటు టిడిపి విజయవంతమయ్యాయి. విజయనగరంలో ఆ విధమైన ప్రయత్నం తక్కువగా ఉంది. కాస్త ఎగువ మధ్యతరగతి వాసులు ఓటు వేసేందుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. రెండు పార్టీల మేనిఫెస్టోల్లో కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే ఉండడం, అభివృద్ధి, ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనకు సంబంధించినవేమీ లేకపోవడం, పన్నుల భారం తదితర అంశాలు విజయనగరంలో పోలింగ్ శాతం పెరగకపోవడడానికి కారణమై ఉంటాయని పలువురు విశ్లేషిస్తున్నారు. అయితే, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వినియోగించుకున్నవారిలో మాత్రం విజయనగరం నియోజకవర్గవాసులే ఎక్కువ మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 18,869 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదు కాగా, ఇక్కడ అత్యధికంగా 4,201ఓట్లు నమోదయ్యాయి. అయినప్పటికీ మొత్తంగా పరిశీలించినప్పుడు విజయనగరంలో పాలకొండ, సాలూరు, కురుపాం వంటి గిరిజన ప్రాంత నియోజకవర్గాలకన్నా ఓటింగ్ శాతం తక్కువగానే నమోదైంది. విజయనగరంలోని ఏడు నియోజకవర్గాల్లో విజయనగరం కన్నా కాస్తంత ఎక్కువగా 76శాతం ఓట్లు నమోదు కాగా, మిగిలిన అన్ని నియోజకవర్గాల్లోనూ 80శాతం పైబడి ఓటింగ్ శాతం నమోదైంది.

## దేవానంద్‌కు బంగారు నంది పురస్కారం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం



గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన కవి, రచయిత, గాయకుడు, సమాజ సేవకుడు పాలక దేవానంద్ నంది పురస్కారానికి ఎంపిక అయ్యారు. ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ నిర్వహించిన సంగీత గాన లహరి కార్యక్రమంలో దేవానంద్ ప్రతిభను గుర్తించి బంగారు నంది పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈనెల 29న హైదారాబాద్ రవీంద్ర భారతిలో తిరుపతి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఐనాక్, సినీ నటులు,దర్శకులు, ఎస్‌వి కృష్ణారెడ్డి, సినీ నిర్మాత, దర్శకులు కె అచ్చిరెడ్డి చేతులు మీదుగా అందుకొనున్నారని తెలిపారు. దేవానంద్ నంది పుష్కరానికి ఎంపిక కావడం పట్ల గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రజలు, స్నేహితులు అభినందించారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో 11కెవి ఫీడర్, అలాగే సీతంపేట 11కెవి ఫీడర్ మరమ్మతులు పనులు శుక్రవారం చేపడుతున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ టిజికె మూర్తి తెలిపారు. ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నము 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ కారణంగా ఎంఎం నగర్, శ్రీనివాస నగర్, ఎన్‌కె రాజపురం, సిఎల్ నాయుడు నగర్, కోమటిపేట, దేవరపేట, వెంకంపేట, పెద్దకాపు వీధి, చిన్నకాపు వీధి, శ్రీకాకుళం రోడ్డు, సీతంపేట రోడ్డు, వెలగవాడ, వోణి, పరశు రామపురం, సిరికొండ, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- మక్కువ

వైకెపి కార్యాల యంలో పనిచేస్తున్న గురునాయుడుపేటకు చెందిన ఐ.అప్పలరాజు మృతి చెందడంతో ఆయన దహన ఖర్చులు నిమిత్తం కుటుంబానికి గురువారం ప్రాజెక్టు నుంచి రూ. 25వేలు అందజేశారు. ఇవి కాకుండా ఆయన కుటుంబానికి మన్యం జిల్లా వెలుగు సిబ్బంది సొంతంగా మరో రూ. 74,100 నగదు రూపంలో ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో డిపిఎంలు అప్పారావు, ప్రవీణ్, ఎపిఎంలు సన్నిబాబు, నీలం నాయుడు, జయకుమార్, వెంకట్ పాల్గొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుబూతిని తెలిపారు.

మృతుని కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న ఉద్యోగులు

సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీనివాసరాజు

## ఆధునిక వ్యవసాయ పద్ధతులపై దృష్టి సారించాలి

ప్రజశక్తి - కురుపాం

రైతులు ప్రస్తుత పరిస్థితుల్లో ఆధునిక వ్యవసాయంపై దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్ర హార్టికల్చర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీనివాసరాజు అన్నారు. గురువారం జియ్యమ్మ వలస మండలం గవరంపేటలో ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైత్తులు సరికొత్త కలుపు మందుల పట్ల అవగాహన ఉండి వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు పాటించి, వారి సేవలను వినియోగించుకొని అధిక దిగుబడులు పొందాలని సూచించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వ్యవసాయ ప్రదర్శనలను సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యం నాయుడు, రైతులు, వ్యవసాయ కళాశాల, విద్యార్థులు పాల్గొన్నారు.